సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 6 । జూన్ । 2024



విత్తన ఎంపికే కీలకం
రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పంట సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో



చిరుత హల్‌చల్
బందంచర్ల అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ద్వారా గుర్తించారు. 8లో



ఏజెన్సీలో భారీ వర్షం
ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 8లో

న్యూస్‌రీల్

గూడెంలో జోరు వాన



తాడేపల్లిగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెంలో బుధవారం రాత్రి ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుని ప్రతాపంతో వేడి గాలులు వీచి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి రాత్రి 7.30 గంటలకు భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోకి వర్షపు నీరు చేరింది. గత వారం రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు వర్షంతో సేదతీరారు.

గోదాములకు ఈవీఎంల తరలింపు ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను బుధవారం గోదాములకు తరలించారు. ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గం సంబంధించిన ఈవీఎంలను ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ ప్రక్రియను ప్రారంభించారు. గురువారం విష్ణు కాలేజీ నుంచి ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను తరలించనున్నారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్‌తో సహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను భీమవరంలోని జిల్లా ఈవీఎం గోదాముకు తరలించి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎం మెషీన్లను వేర్వేరుగా భద్రపరుస్తున్నారు. జిల్లా గోదాములో ఈవీఎంలు అమరిక ప్రక్రియకు సుమారు నాలుగు రోజుల సమయం పట్టనుంది. ఈ ప్రక్రియలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులు చందన దుర్గాప్రసాద్, జిల్లా ఈవీఎంల నోడల్ అధికారి, ఇరిగేషన్ ఇంజినీర్స్, డిప్యూటీ తహసీల్దార్ మద్రాపు సన్యాసిరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్ మూసివేత

భీమవరం (ప్రకాశం చౌక్): ఏపీఎస్ ఆర్టీసీ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ నిమిత్తం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లోని బస్ పాస్ కౌంటర్‌ను 6, 7 తేదీల్లో మూసివేస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. కావున ప్రయాణికులు, విద్యార్థులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల ముగిసిన 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం ఏలూరులోని సెయింట్ జేవియర్ పాఠశాలలో ఈ నెల 9వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేస్తారన్నారు. ఇందుకు గాను జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు రాసిన 5,795 జవాబు పత్రాలు వచ్చాయన్నారు. వీటి మూల్యాంకనం నిమిత్తం 292 మంది చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు 55 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించామని డీఈఓ అబ్రహం వివరించారు.

'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలకు 296 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 296 మంది హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 164 మందికి గాను 119 మంది హాజరు కాగా, 45 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 201 మందికి గాను 177 మంది హాజరు కాగా, 24 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ కమిటీ కలిపి మొత్తం 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- జిల్లాలో 2.32 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సార్వా సాగు
- నారుమడులు పోసుకోవడంలో నిమగ్నమైన రైతులు
- తాడేపల్లిగూడెంలో 160 ఎకరాల్లో నారుమడులు పూర్తి
- విత్తనాలు, 45,324 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం
- స్వర్ణకు బదులు ఎంటీయూ 1318 వంగడం మేలంటున్న శాస్త్రవేత్తలు

నైరుతి రుతుపవనాల రాకతో పాటు డెల్టా కాలువలకు సాగునీటి విడుదల నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నారుమడులు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులకు విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది.



తాడేపల్లిగూడెం మండలంలో సిద్ధమైన నారుమడి

సాక్షి, భీమవరం : జిల్లాలోని డెల్టా, మెట్ట ప్రాంతంలోని 2.32 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు జరగనుంది. రబీ మాసూళ్లు ముందుగా పూర్తి చేసుకున్న జిల్లాలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో రైతులు నారుమడులు పోసేందుకు పొలాలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో నాట్లు వేసేందుకు 12,120 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా, తాడేపల్లిగూడెం రూరల్‌లో 160 ఎకరాల్లో నారుమడులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో వారం, పదిరోజుల్లో పనులను వేగవంతం చేసి ఈ నెల 25 నాటికి జిల్లా వ్యాప్తంగా నారుమడుల పనులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. నవంబర్ చివరిలో వచ్చే తుపానుల బారిన పడకుండా ముందుగానే పంట చేతికి అందేలా జూలై 15 నాటికి నాట్లు వేయాలని కోరుతున్నారు.

సిద్ధంగా విత్తనాలు, ఎరువులు

సార్వా సాగుకు 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా, కొరత లేకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంటీయూ 1318, 7029, 1061, 1064 రకాలతో పాటు స్పందన స్వర్ణ, పీఆర్ 126 వరి వంగడాలు అందుబాటులో ఉంచారు. ఈ సీజన్‌లో 21,272 మెట్రిక్ టన్నుల యూరియా, 23,464 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,391 మెట్రిక్ టన్నుల డీఏపీ, 6,391 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 5,387 మెట్రిక్ టన్నుల ఎంఓపీలతో మొత్తం 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. మార్క్‌ఫెడ్ వద్ద 3,008 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్స్ వద్ద 29,293 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ వద్ద 11,446 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 45,324 మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల వద్ద 1,488 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచింది.

మార్టేరులో విత్తన విక్రయాలు

మార్టేరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఎంటీయూ 1318 రకం విత్తన విక్రయాలను బుధవారం ప్రారంభించింది. శుక్రవారం వరకు వీటి అమ్మకాలు జరగనున్నాయి. ఫౌండేషన్, సత్య ప్రమాణ (ట్రూత్‌ఫుల్ లేబుల్) విత్తనాలు 1500 క్వింటాళ్లు సిద్ధం చేసినట్టు పరిశోధన కేంద్రం ఏడీఆర్ డి.శ్రీనివాస్ తెలిపారు. ఎంటీయూ 1318 ఫౌండేషన్ విత్తనాల 25 కేజీల బస్తా ధర రూ.1000, సత్యప్రమాణ విత్తనాల బస్తా ధర రూ.950లుగా ఉన్నట్లు తెలిపారు. మరోపక్క వ్యవసాయశాఖ 100 క్వింటాళ్ల వరకు విత్తనాలను కేజీకి రూ.ఐదు సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధం చేసింది.

విత్తన ఎంపిక ముఖ్యం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంట తెగుళ్లు, వైపరీత్యాలను తట్టుకుని నిలిచే ఆధునిక వంగడాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులోకి తెస్తున్నా రైతులు కాలం చెల్లిన వాటినే సాగు చేయడం పరిపాటిగా మారింది. తొలకరిలో 85 శాతం విస్తీర్ణంలో స్వర్ణ (ఎంటీయూ–7029) వెరైటీని సాగుచేస్తుండగా మిగిలిన మేర ఇతర వెరైటీలను సాగు చేస్తుంటారు. దీని కాండం దృఢంగా లేకపోవడం వలన వర్షాలు, గాలులకు పడిపోతుంది. సాగు చివర్లో వచ్చే తుపానులను స్వర్ణ వెరైటీ తట్టుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఖరీఫ్‌లో విపత్తులను ఎదురొడ్డి నిలిచి అధిక దిగుబడినిచ్చేలా మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం రూపొందించిన ఎంటీయూ 1318 వెరైటీ స్వర్ణకు ప్రత్యామ్నాయంగా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 150 రోజుల కాల పరిమితి కలిగిన ఈ వెరైటీ తక్కువ నత్రజనితో స్వర్ణకన్నా పదిశాతం అధిక దిగుబడి ఇస్తుందని, మిల్లర్‌కు, మార్కెట్‌కు అనువుగా ఉంటుందంటున్నారు.

యాక్షన్ ప్లాన్ రెడీ



నాణ్యమైన అధిక దిగుబడులే లక్ష్యంగా జిల్లాలో ఖరీఫ్ సాగు కోసం ఇప్పటికే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో 2.32 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుండగా 5,740 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. విత్తన ఎంపికపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు త్వరితగతిన పనులు చేపట్టి సకాలంలో నాట్లు పూర్తి చేయాలి.
– జెడ్.వెంకటేశ్వరరావు, జేడీఏ, పశ్చిమగోదావరి జిల్లా

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్యపడవద్దు

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి



పాలకొల్లు అర్బన్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలకు, అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరిస్తానన్నారు. అలాగే ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిర్మాణాత్మక కృషి చేస్తానన్నారు. గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడకుండా మనోనిబ్బరంతో ముందుకు సాగాలని, వారికి ఏ కష్టమొచ్చినా తనను నేరుగా సంప్రదించాలని గోపి కోరారు. ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలకు గుడాల గోపి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేటి ఓటమి.. రేపటి గెలుపునకు నాంది



ఏలూరులో ఆళ్ల నానిని కలిసిన కార్పొరేటర్లు, వివిధ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)ని శ్రీరామ్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం పలువురు నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ సైతం కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, నేటి ఓటమి రేపు గెలుపుకు నాంది అన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా, అవసరం వచ్చినా తానుముందుంటానని చెప్పారు. ఎన్నికల ఫలితాలు కొంత బాధాకరం అనిపించినా ప్రజల తీర్పును శిరసావహిస్తున్నట్లు చెప్పారు. పదవి, అధికారం ఉన్నా, లేకపోయినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధి కోసం పాటు పడతానని హామీ ఇచ్చారు. ఆళ్ల నాని కలిసిన వారిలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా నిలబడతాం

- రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమావేశం



తణుకులో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యమైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఈగ వాలనీయకుండా కాపాడుకుంటానని, ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలబడతానని స్పష్టం చేశారు. ప్రశాంతతకు మారుపేరైన తణుకులో రాజకీయపరంగా ఎన్నో ఎన్నికలు చూశానని, కానీ నేడు కూటమికి చెందినవారు వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకుల ఇళ్లపైకి వచ్చి దురుసుగా మాట్లాడుతుండడం బాధాకరమన్నారు. మా నాయకుడు అందరికీ మంచి చేయాలనేదే మాకు నేర్పించారని, తణుకు నియోజకవర్గంలో కూడా గత ఐదేళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉండగా ఎప్పుడూ కూడా గొడవలను, దౌర్జన్యాలను ప్రోత్సహించలేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తమ పార్టీ కార్యకర్తలను ఎటువంటి ఇబ్బందులకు గురిచేసినా న్యాయబద్ధంగా పోరాడతామని అన్నారు. టీడీపీ కార్యకర్తలంతా దోచుకుతినేందుకు ఆవురావురంటూ ఎదురుచూస్తున్నారని, గతంలో ఇష్టానుసారంగా దోచుకున్న తీరును మరొక్కసారి ప్రజలు చూడాల్సి ఉందన్నారు. ఇందుకోసమే ల్యాండ్ టైట్లింగ్ విధానం ద్వారా మీ ఆస్తులను తాకట్టుపెట్టి దోచుకుంటారనే విపరీతమైన ప్రచారం జగన్ ప్రభుత్వంపై చేసి లాభపడ్డారని అన్నారు. ఇకపై తమ కార్యకర్తల పరిరక్షణ కోసమే పనిచేస్తానని, ప్రజలకు అన్యాయం జరిగిన సందర్భంలో మాత్రం వారితో పోరాటం చేస్తామని, తమ కార్యకర్తల జోలికి వస్తే మాత్రం న్యాయపోరాటం చేస్తామన్నారు. తనతో పాటు కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ కూడా అందుబాటులో ఉంటారని, ఏ సమయంలో ఫోన్ చేసినా తాను మాట్లాడతానని చెప్పారు. ప్రజలకు మంచి చేసే క్రమంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు సహకారంగా ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఆప్యాయంగా కలిసి వారితో కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పట్టణ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల పార్టీ అధ్యక్షులు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణం.. ప్రాణాధారం

- కాలుష్యంతో ప్రశ్నార్థకంగా ప్రజల మనుగడ
- చెట్ల తొలగింపు, ప్లాస్టిక్ వ్యర్థాలతో సమస్య తీవ్రం
- పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 వరకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు



భీమవరం పీఎస్ఎం స్కూల్లో మొక్కలు నాటుతున్న డీఈవో నాగమణి



భీమవరం పీఎస్ఎం స్కూల్లో పర్యావరణంపై విద్యార్థులు అవగాహన ప్రదర్శన దృశ్యం

భీమవరం: సమాజంలో అభివృద్ధి పెరిగే కొద్దీ పుడమి తల్లికి కష్టాలు తప్పడం లేదు. పెరుగుతున్న జనాభా, విలాసవంతమైన జీవన విధానంలో నీరు, భూమి, గాలి సైతం కలుషితమవుతున్నాయి. దీంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఆధునికత పేరుతో చెట్ల పెంపకం తగ్గడం, ప్లాస్టిక్ వాడకం పెరగడంతో ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవైపు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెట్ల తొలగింపు, పరిశ్రమలు, వాహనాలతో కాలుష్యం రెట్టింపు అవుతోంది. ఫలితంగా భూతాపం రోజురోజుకు పెరిగి సకాలంలో వర్షాల రాక తగ్గిపోయింది. దీనికి తోడు విపత్తులు చోటు చేసుకుని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ తన పరిధిలో పుడమితల్లిని కాపాడుకునేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిలో భాగంగానే ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది.



భీమవరం పీఎస్ఎం స్కూల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ప్రదర్శన


పాఠశాల స్థాయి నుంచే అవగాహన

పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధంగా ఇంటర్ ప్యానల్ ఇన్‌క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. పొల్యూషన్ బోర్డు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో బుధవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

5వ తేదీన ప్లాస్టిక్ ఉపయోగించరాదని చెప్పే కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించారు. పర్యావరణ అనుకూల వస్తువులను వాడడం, ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోస్టర్లు, జనపనార వస్తువుల వాడకం, పర్యావరణ అనుకూల అలవాట్లు పెంపొందించడం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ నెల 12న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో నీటి లీకేజీని అరికట్టడం, పైపుల లీకేజీని తనిఖీ చేయడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణ, నీటి సంరక్షణ ర్యాలీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలపై అవగాహన కార్యక్రమాలు పాఠశాలల్లో చేపట్టనున్నారు. 13న విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఎనర్జీ సేవింగ్ యాక్టివి ఎకో క్లబ్ ఎనర్జీ టీమ్‌తో డ్యూటీ రోస్టర్, నాలెడ్జ్ బిల్డింగ్ సమీక్షలు, పోస్టర్లు, బ్యానర్లు వంటి ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 14న పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో రెండు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, శానిటరీ వ్యర్థాలు, కంపోస్ట్ పిట్లు, వస్త్రాలు, బొమ్మలు వంటి వివరాల డ్రైవ్ నిర్వహించడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్టివ్ వంటివి నిర్వహిస్తారు. 15న పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో వ్యర్థాలను సేకరించడం, భూమిపై వ్యర్థాల ప్రభావంపై విద్యార్థులతో చర్చించడం వంటి కార్యక్రమాలు చేపడతారు. 18న కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్ సీసాలు వంటి అందుబాటులో ఉన్న పదార్థాలను ఉపయోగించడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, ఉత్పత్తి రికార్డు నిర్వహించడం, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం వంటి కార్య క్రమాలను నిర్వహిస్తారు. 19న నేచర్ నాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆధారాలు, సంప్రదాయాలను పరిశీలన కోసం సమీప గ్రామాల సందర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

విజయవంతం చేయాలి



పాఠశాలల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి. నీటి వృథాను అరికట్టడం, మొక్కలను నాటడం, విద్యుత్తు ఆదా, వ్యర్థాలను పునర్వినియోగం వంటి కార్యక్రమాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలి.
– పి.శ్యామ్‌సుందర్, జిల్లా సర్వశిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, భీమవరం

అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలి. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి.
– యండమూరి చంద్రశేఖర్, ఎస్ఎస్ఏ సీఎంఓ, భీమవరం

విత్తన ఎంపిక కీలకం

- మేలైన సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులు
- విత్తనాల ఎంపిక, మొలక శాతాన్ని పెంచడంపై అధికారుల సూచనలు


మెట్ట ప్రాంతంలో బోరు బావి కింద వేసిన వరి నారుమడి మొలకెత్తిన దృశ్యం

చింతలపూడి: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతిలో పంట సాగు చేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్ సూచించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో మెట్ట ప్రాంతంలో అధికంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి పంటలను రైతులు పండిస్తుంటారు. విత్తన ఎంపిక దగ్గర నుంచి మేలైన సస్యరక్షణ ద్వారా దిగుబడులు ఎలా పెంచుకోవచ్చో ఆయన వివరించారు.

విత్తనాలలో మొలక శాతాన్ని పెంచడం ఎలా ?
విత్తనం మొలకెత్తి మొక్కగా పెరగడం దాని సజీవత్వంపై ఆధారపడి ఉంటుంది. విత్తన సజీవత్వాన్ని తెలుసుకోవాలంటే విత్తనాలను ఆరుగంటలసేపు నానబెట్టి పప్పు ధాన్యాలైతే బీజ కవచం తొలగించి 0.1 శాతం టెట్రాజోలియం ద్రావణంలో అరగంటసేపు, ధాన్యపు, చిరుధాన్యపు గింజలైతే బీజకవచం తొలగించి లేదా సన్నని రంధ్రం చేసి 3 గంటల వరకు చీకటి ప్రదేశంలో ఉంచాలి. తర్వాత విత్తనాలను మధ్యకు కోసి పరీక్షించాలి. విత్తనం రంగు ఎరుపు రంగుకు మారితే విత్తనం జీవం కల్గి ఉన్నట్లు. కొన్ని సందర్భాల్లో విత్తనాలు జీవం కల్గి ఉన్నప్పటికీ అవి మొలకెత్తవు. ఈ స్థితిని నిద్రావస్థ అంటారు.

మొలక శాతం
ఎత్తు అంచు గల స్టీలు ప్లేటు గాని, మట్టి మూకుడు కాని ఇసుకతో నింపి, దానికి తగు మోతాదులో నీరు పోసి 100 విత్తనాలను లెక్కించి వాటిపై ఇసుకను కప్పాలి. ప్రతి రోజూ నీరు చిలకరిస్తుండాలి. విత్తన రకాన్ని బట్టి 3–4 రోజుల నుంచి 7–8 రోజుల్లో మొలక కనిపిస్తుంది. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాలను లెక్కిస్తే మొలక శాతం తెలుస్తుంది. విత్తనం టెట్రాజోలియం పరీక్షలో జీవం ఉన్నదిగా తేలి, మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే ఆ విత్తనం నిద్రావస్థలో ఉన్నట్లు భావించాలి.

నిద్రావస్థను తొలగించే పద్ధతులు
వరి విత్తనాన్ని 24 గంటల పాటు 50 సెల్సియస్ వద్ద నీటిలో నానబెడితే నిద్రావస్థ తొలగిపోతుంది. లేదా లీటరు నీటికి 7 మిల్లీ లీటర్ల నత్రికామ్లం కలిపి ఆ ద్రావణంలో 12 గంటలు నానబెడితే నిద్రావస్థ తొలగుతుంది.

పత్తి విత్తనాలు: విత్తనపు కవచం విత్తనాలు మొలకెత్తడానికి అవరోధంగా ఉన్నప్పుడు విత్తన కవచాన్ని రసాయనాల ద్వారా గాని, విత్తనాన్ని రుద్దడం ద్వారా గాని నిద్రావస్థ నుంచి తొలగించవచ్చు. పత్తి విత్తనాలైతే గాఢ సల్ఫ్యూరిక్ ఆమ్లంతో శుద్ధి చేయడం ద్వారా నిద్రావస్థ తొలగించవచ్చు. కొన్ని రకాల విత్తనాలను వేడి నీటిలో 800 సెంటీ గ్రేడ్ వద్ద 3 నిమిషాలు ఉంచితే మొలక శాతం పెరుగుతుంది.

వేరుశనగ విత్తనాలు : వేరుశనగ విత్తనాలలో ఎథిరిల్ – 100 పీపీఎం లేక జిబ్బరిల్లిక్ యాసిడ్ 10 పీపీఎం విత్తనాలను దాదాపు 6 గంటల పాటు నానబెట్టి మొలకశాతం పెంచవచ్చు. కొన్ని రకాల విత్తనాలను పొటాషియం నైట్రేట్, థయోయూరియ వాడి విత్తనపు నిద్రావస్థను తొలగించవచ్చు. అంతర్జాతీయ విత్తన పరిశోధనా సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం వివిధ విత్తనాలలో ఉండాల్సిన మొలక శాతం ఈ విధంగా ఉంది. వరి 80 శాతం, జొన్నలు 75 శాతం, మినుములు 75 శాతం, శనగ 85 శాతం, పెసలు 75 శాతం, కంది 75 శాతం, సోయా చిక్కుడు 70 శాతం, మిరప 60 శాతం ఉండాలని ఆయన తెలిపారు.


బి నాగకుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు, చింతలపూడి సబ్ డివిజన్

క్లుప్తంగా

బస్సును ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి

మరో యువకుడికి గాయాలు


చిప్పల నాగరాజు మృతదేహం (23)

ఆకివీడు: మోటారుసైకిల్‌పై వేగంగా వెళుతూ బస్సును ఢీకొట్టిన సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం బుధవారం రాత్రి స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద జరిగింది. ఏలూరు నుంచి ఆకివీడు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వంతెన దిగుతుండగా, ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఆకివీడు నుంచి కైకలూరు వైపు మోటారుసైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అతి వేగంగా కుడివైపునకు వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో కృష్ణా జిల్లా కలిదిండి మండలం సున్నంపూడి గ్రామానికి చెందిన చిప్పల నాగరాజు (23) అక్కడికక్కడే మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన చింతా కృష్ణంరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా వారు హుటాహుటిన వచ్చి గాయపడిన కృష్ణంరాజును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బత్తిన నాగబాబు వెళ్లి నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

టీడీపీ కవ్వింపు చర్యలు

తణుకు టౌన్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా గ్రామాల్లో టీడీపీ కూటమి కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం తణుకు మండలం మండపాక, ముద్దాపురం గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్ల వద్ద కూటమి కార్యకర్తలు రెచ్చగొట్టే విధంగా ప్రదర్శనలు నిర్వహించినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు. అంతేకాకుండా బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో టీడీపీకి మద్దతు తెలిపిన గ్రామ నాయకురాలు ఇంటివద్ద వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి చేసినట్లు తెలిపారు. అయితే ఈవిషయం బయటకు రాకుండా గ్రామ టీడీపీ నాయకులు ఇరువర్గాలకు నచ్చచెప్పి సర్దుబాటు చేశారని చెబుతున్నారు. అయితే వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో టీడీపీ కూటమి కార్యకర్తలు గుంపులుగా తిరుగుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. గ్రామాల్లో కవ్వింపు చర్యల ద్వారా అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. వీటిని పోలీసులు అదుపు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

మందాలమ్మకు ముత్యాల హారం


మందాలమ్మకు ముత్యాల హారం బహూకరిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు తాడేపల్లిగూడెం వాస్తవ్యులు అన్నమనీడి నాగ సుబ్రహ్మణ్యం, అనిత దంపతులు 355 గ్రాముల వెండి ముత్యాల హారం సమర్పించారు. బుధవారం ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముత్యాల హారాన్ని అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

విధి నిర్వహణలో గుండెపోటుతో డాక్టర్ మృతి


డాక్టర్ గంటా ప్రభాకరరావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ గంటా ప్రభాకరరావు (61) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం ఉదయం విధులకు వచ్చిన డాక్టర్ ప్రభాకరరావు కొంతసేపటికి కూర్చున్న కుర్చీలో నుంచి పడిపోవడంతో ఆసుపత్రి సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆయన్ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. డాక్టర్ ప్రభాకరరావు గతంలో పాలకొల్లు సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై రాజోలు వెళ్లారు. మూడేళ్ల క్రితం మళ్లీ రాజోలు నుంచి పాలకొల్లు వచ్చారు. ఈయన చిన్నపిల్లల వైద్య నిపుణులు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతి పట్ల పట్టణ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గ్రామాల్లో శాంతిభద్రతలపై ఆరా


దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి

దెందులూరు: మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. బుధవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన వారితో సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై కె.స్వామిని కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కొవ్వలి, శ్రీరామవరం, సోమవరప్పాడు మూడు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పహారా కాస్తున్నామని ఎస్పీకి వివరించారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు కేంద్ర సాయుధ బలగాలతో పాటు దెందులూరు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నామని ఎస్సై కె.స్వామి చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఉపాధి హామీ కింద 4,500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం
- కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్


ఏలూరు కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కింద (ఎన్‌ఆర్‌ఈజీఎస్) డ్వామా ఆధ్వర్యంలో 4,500 ఎకరాల్లో పండ్ల మొక్కలు పెంచాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా 3 వేల ఎకరాలను గుర్తించి అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. ప్రహరీ గోడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంస్థల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రతి మండలంలో విద్యాసంస్థలు గుర్తించి అంచనాలు తయారుచేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీ, ప్రభుత్వ భూముల్లో మొక్కల పెంపకానికి 45 ఎకరాలు గుర్తించామన్నారు. రోడ్ల వెంబడి, కాల్వగట్ల వెంబడి 75 కి.మీ మేర మొక్కల పెంపకానికి చర్యలు తీసుకున్నామన్నారు. పాడి పశువులు కలిగిన రైతులకు గడ్డి పెంపకానికి 225 ఎకరాలు గుర్తించామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ
భీమవరం: గ్లోబల్ వార్మింగ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఏడు జిల్లాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారిణి జి నాగమణి అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం భీమవరం పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పర్యావరణం కోసం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, గుడ్డ సంచులను ఉపయోగించేలా వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వశిక్ష అభియాన్ సీఎంఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేల తల్లిని కాపాడుకుంటేనే ఆరోగ్యం కూడా బాగుంటుందని, ప్రజలు నేల, నీరు, గాలిని కలుషితం చేయకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్‌ఎం జె సుధారాణి, పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, నందమూరి రాజేష్, పి రామభద్రిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


భీమవరం పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కను నాటుతున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం కోసం జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను పెంచాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులను లేదా కాటన్ బ్యాగ్‌లను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ పర్యవేక్షించగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్ వాసుదేవ్, సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కుమారి బి.రచన, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కె.స్పందన, పీపీ కె.సీతారాం, ఏపీపీలు సీహెచ్ రాజేంద్రప్రసాద్, డీవీ రామాంజనేయులు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, కల్చరల్ సెక్రెటరీ టి.సుబ్బారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాసవర్మ

భీమవరం: నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ చెప్పారు. భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సభ్యునిగా అందరి సహకారంతో నరసాపురం పార్లమెంట్‌ను రోల్‌మోడల్‌గా తయారుచేయడానికి కృషి చేస్తానన్నారు. ఎంపీగా తాను ప్రజల ఆకాంక్ష, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల నామినేషన్స్‌కు ముందు బీజేపీ అభ్యర్థిని మార్చుతోంది, శ్రీనివాసవర్మ గెలవలేరనే కొందరు చేసిన అసత్య ప్రచారాలు ప్రజలు విశ్వసించకుండా గెలిపించినందుకు నియోజకవర్గంలోని ప్రజలందరకూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, కొటికలపూడి గోవిందరావు(చినబాబు), నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు(సుభాష్), బన్నీ వాసు, ఉన్నమట్ల కబర్ధి, కాయిత సురేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యత్వాలు తీసుకోవాలి


గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు గ్రంథాలయాల్లో సభ్యత్వాలు తీసుకుని నిత్యం గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని బాల వికాస నిపుణులు ఆర్.విజయకుమార్ సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాల ద్వారా అనేక నూతన విషయాలు తెలుసుకోవచ్చని, అవి విద్యార్థి చదువుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు రిసోర్స్‌పర్సన్లు విద్యార్థులచే వివిధ రకాల ఆటలు ఆడించడం, పేపర్ క్రాఫ్టస్‌తో గృహాలంకరణ వస్తువుల తయారీ వంటి వాటిలో నైపుణ్య శిక్షణ అందించారు. రిసోర్స్ పర్సన్లు డీ శ్రీవల్లి విద్యార్థులకు నీతి కథలు బోధించగా, కె.శంకర్ చిత్రలేఖనంలో మెలకువలు నేర్పారు. ఈ కార్యక్రమాన్ని ఉప గ్రంథపాలకుడు ఏ నారాయణ పర్యవేక్షించారు.

పోక్సో కేసు నమోదు

కొయ్యలగూడెం: బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కొయ్యలగూడెం ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దిప్పకాయలపాడుకు చెందిన చాపల ప్రవీణ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించమని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఆమె ఇంటికి వెళ్లి ప్రేమించమని, లేకపోతే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిరుతపులి హల్‌చల్

- సీసీ కెమెరాల్లో చిరుతపులి చిత్రం రికార్డు
- రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



సీసీ కెమెరాలో రికార్డయిన బందంచర్ల ఫారెస్ట్ ఏరియాలో సంచరిస్తున్న చిరుతపులి

టి.నరసాపురం: టి.నరసాపురం, చింతలపూడి మండలాల మధ్య నున్న బందంచర్ల ఫారెస్ట్‌లో చిరుతపులి హల్‌చల్ చేస్తోంది. ఈ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుత సంచరిస్తున్నట్లుగా రికార్డయ్యింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల క్రితం టి.నరసాపురం మండలం బందంచర్ల ఏరియాలో చిరుతపులి జాడలను రైతులు గుర్తించి తొలుత ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. అప్పట్లో అధికారులు వచ్చి కాలి గుర్తులను సేకరించారు. తరువాత రెండు రోజుల క్రితం చింతలపూడి మండల సరిహద్దులోని కంచనగూడెం గ్రామం అటవీ ప్రాంత సమీపంలో రైతు పీకా నాగేశ్వరరావు పొలంలో ఏడాది వయసున్న గేదె పెయ్యపై చిరుత దాడి చేసి చంపి కొంత ఆహారాన్ని భుజించింది. అయితే అక్కడకు రెండవ రోజు కూడా ఆహారానికి వస్తుందనే అంచనాతో ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతంలో 6 సీసీ కెమేరాలు అమర్చారు. వారి అంచనాలకు తగ్గట్టుగా చిరుత మంగళవారం రాత్రి కూడా అదే ప్రాంతానికి వచ్చి మరికొంత ఆహారాం తిన్నది. చిరుత ఆ ప్రాంతానికి వచ్చినట్లుగా సీసీ కెమేరాలో రికార్డ్ అయ్యింది. రికార్డ్ అయిన దృశ్యాలను ఏలూరు ఫారెస్ట్ రేంజర్ ఎస్‌వీకే కుమార్, పోలవరం రేంజర్ దావీదు రాజు బుధవారం పరిశీలించారు. చిరుత కదలికలను గుర్తించేందుకు మరో 6 సీసీ కెమేరాలను బుధవారం అమర్చినట్లు ఫారెస్ట్ బీట్ అధికారిణి బి.దుర్గాభవానీ తెలిపారు. చింతలపూడి – టి.నరసాపురం మండలాల ఫారెస్ట్ సరిహద్దు గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు ప్రచారం నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు చిరుతను బంధించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు భవానీ తెలిపారు.

ఏజెన్సీలో ఈదురుగాలులతో వర్షం

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం పడడంతో ఉపశమనం పొందారు. ఆకాశంలో కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం పడింది. ఈ గాలులకు పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో రహదారిపై పలు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొందరు యువకులు చెట్లను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. భారీగా చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం ఏర్పడింది.

పిడుగులతో కూడిన వర్షం
టి.నరసాపురం: టి.నరసాపురంలో బుధవారం రాత్రి పిడుగులతో కూడిన వర్షం పడింది. ఒక్కసారిగా వాతావరణం మారి మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. గ్రామంలోని పెట్రోల్ బంక్‌కు అతి సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. అలాగే స్థానిక విజయలక్ష్మి థియేటర్ సమీపంలో కొబ్బరి చెట్టుపై మరో పిడుగు పడింది. పిడుగుపాట్లకు స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.


బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం


బుట్టాయగూడెం మండలం మర్లగూడెం సమీపంలో చెట్టుకొమ్మలు విరిగిపడిన దృశ్యం


టి.నరసాపురం పెట్రోల్ బంక్ సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగుపడి దగ్ధమవుతున్న దృశ్యం

క్లుప్తంగా

వాసవి పంచాయతన క్షేత్రంలో రుద్రాభిషేకం



ఉమా చంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖమాసం మాస శివరాత్రి సందర్భంగా వాసవి పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న ఉమా చంద్రశేఖర్ స్వామి వారికి బుధవారం విశేష పూజలు, మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిగింది. ఆర్యవైశ్యులు, భక్తులు పూజలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా పెన్నేరమ్మ మారెమ్మ జాతర



మొగల్లులో వేంచేసియున్న పెన్నేరమ్మ మారెమ్మ అమ్మవార్లు

పాలకోడేరు: మొగల్లులో వేంచేసియున్న పెన్నేరమ్మ మారెమ్మ అమ్మ వార్ల జాతర మహోత్సవాలు క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని చలివిడి, పానకాలు కొబ్బరికాయలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో కోయ డాన్సులు, బుట్ట బొమ్మలు, వివిధ రకాల దేవతల వేషధారణతో బాణసంచా కాల్చి అమ్మవార్లను ఊరేగించారు.

పేద కుటుంబానికి అండ

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా ప్రకటించారు. పేద ఆర్యవైశ్య కుటుంబంలో సోమేశ్వరరావు, లక్ష్మీ సరస్వతి దంపతులు వృద్ధులవడంతో ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నారు. వారి కుమారుడు నాని కిరాణా షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఇటీవల నానీకి వెన్నుపూస ఆపరేషన్ చేయడంతో ఏ పని చేయలేని పరిస్థితుల్లో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిసి, సంఘ సభ్యులు సుమారు రూ.20 వేలు సేకరించామని గ్రంధి రాజా అన్నారు. ఈ నగదుతో ప్రతి నెలా కిరాణా సరుకులు ఇస్తామని తెలిపారు. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యులు ఆర్యవైశ్య కుటుంబాన్ని కలసి బియ్యం, మామిడి పళ్లు, అల్పాహారం అందజేశారు. అలాగే నానికి ఉచితంగా వైద్యం చేయించి, అనంతరం ఉపాధి కల్పిస్తామని గ్రంధి రాజా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కూర్మాల పూర్ణారావు, కోశాధికారి అత్యం వాసు, కూర్మాల కాశి, యానాదిశెట్టి, అమరా కృష్ణ ప్రసాద్, సోము దుర్గాభవాని, ప్రసాద్ ఉన్నారు.

చిరస్మరణీయులు ఉద్యమకారులు



ఐద్వా నాయకురాలు స్వర్గీయ బొక్కా సత్యవతికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆకివీడు: ప్రజా ఉద్యమాల్లో పనిచేసే వారి మరణం చిరస్మరణీయమని పలువురు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక జవహర్ పేటలో సీపీఎం నాయకురాలు బొక్కా సత్యవతి మూడవ వర్ధంతి సభ నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. డోకల లక్ష్మీ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ఐద్వా కమిటీ సభ్యురాలు సందక ఉదయకుమారి మాట్లాడుతూ ఉద్యమకారులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. కరోనా సమయంలో రోగులకు విస్తృత సేవలందించి, అసువులుబాసారన్నారు. ప్రజా సమస్యలపై ఆమె నిరంతరం పోరాడుతూ, అన్యాయాల్ని ఎదురించి, కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ ఉద్యమించిన గొప్ప నాయకురాలని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బి.సత్యనారాయణ, సీఐటీయూ మండల నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, గేదల విజయలావణ్య, గోపిశెట్టి రాణి, అమ్మాజీ, రవితేజ, పెంకి అప్పారావు, మహిళలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, నగదు, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



తణుకు అర్బన్: ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపు చేస్తున్న ఎంఈవో హైమావతి, ఉపాధ్యాయులు



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్



తాడేపల్లిగూడెం (టీఓసీ): అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం



తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ గ్రౌండ్‌లో మొక్కలు నాటుతున్న వాకర్స్



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న దృశ్యం



తణుకు టౌన్ తేతలిలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తణుకు అర్బన్: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని తణుకు ఎంఈవో 2 హైమావతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ క్లబ్ ఏర్పాటుచేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సర్పంచ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ పోతుల అన్నవరం బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలంటే మొక్కలు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ, సచివాలయ కార్యదర్శులు టి.రవిచంద్ర, జే.దివ్య, జూనియర్ అసిస్టెంట్ రఘు, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ కే.రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

తాడేపల్లిగూడెం(టీఓసీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు దూలం నాగరాజు ఆధ్వర్యంలో అసోసియేషన్ గ్రౌండ్ వద్ద మొక్కలు నాటారు. సేవ్ ప్లాంట్స్, పర్యావరణాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేశారు. కోశాధికారి మల్లారెడ్డి సారథి, డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, సుధాకర్, వాకర్స్ సభ్యులు హాజరైయారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో

పట్టణంలో మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. రాగిరెడ్డి ఉదయ్ కుమారి, ఇందిరా కుమారి, అరుణ కుమారి, వజ్రమ్మ, చంటమ్మ, నాగేంద్ర ప్రసాద్, కోపల్లె శ్రీనివాస్ తదితర వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో...

పట్టణంలోని 28వ వార్డులోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ మొక్కలను నాటాలని, ప్లాస్టిక్ సంచులు బదులు నారా సంచులు ఉపయోగించాలని, మురికి నీరు నిల్వ ఉండకుండా ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తదితర సూచనలు చేశారు. పిల్లలచేత పర్యావరణాన్ని రక్షించాలని, మొక్కలు నాటుదామని, పరిశుభ్రత పాటిద్దామని ర్యాలీ నిర్వహించారు.

మొక్కలతో పర్యావరణ సమతుల్యత

తాడేపల్లిగూడెం రూరల్: మొక్కల ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కేఎల్.సరస్వతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 141 ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది సీడ్ బాల్స్ తయారు చేశారు. అనంతరం సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు సీహెచ్.రజనీకుమారి, బి.అరుణ దేవి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఎం.దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎ.తులసీరాణి, టి.రామలక్ష్మి, కే.గీత, టి.అంజికుమారి, ఎం.శాంతి కుమారి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

తణుకు టౌన్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తేతలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె పుల్లారెడ్డి చెప్పారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తణుకు రూరల్ మండలం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు గ్రామంలో అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం పుల్లారెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ పెరగకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రీన్ టీచర్ బీఎం గోపాలరెడ్డి పర్యావరణంపై విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలోపర్యావరణ పరిరక్షణకు సంబంధించి వ్యాసరచన, పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు యు అనూరాధ, పీ గంగాభవానీ, కేఎస్‌వీ ప్రకాశరావు, జే బుచ్చియ్య, కె శ్రీనివాసు, కె దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులుగా ఉన్నత విలువలు సాధిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థినీ, విద్యార్థులు చదువులతో పాటు ఉన్నత విలువలను కూడా సాధించాలని వేసవి శిక్షణ శిబిరం రిసోర్స్‌పర్సన్‌లు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణా శిబిరం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎన్.సత్యం, ప్రత్తి వీరాస్వామి, వి.రామాంజనేయులు, గరికపాటి బాపయ్య శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం విశేషాలు, స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, లెక్కలలో టిప్స్, పొడుపుకథలు, తదితర విషయాలను నేర్పించారు. ఆట పాటలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్‌డీఎస్‌ఎస్ స్కీం బైపరకేషన్ మరమ్మతుల నిమిత్తం హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సత్యవతినగర్, నిట్ ఫీడర్ పరిధిలో ఈ నెల 6వ తేదీ గురువారం రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్‌టౌన్‌లోని వానపల్లిగూడెం, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐకాలనీ, గాయత్రి గుడి ఏరియాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుతుక్రమంపై అవగాహన ర్యాలీ



పైడిపర్రులో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తణుకు: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పైడిపర్రులో బుధవారం కిశోరబాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిశోరబాలికలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే ప్రతినెలా సక్రమంగా రుతుక్రమం జరుగుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నైపుణ్యాల నెలవు.. వృత్తి విద్యా కోర్సులు



పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల



పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్) కోర్సుపై విద్యార్థుల ఆసక్తి

పెంటపాడు: ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో ఒక ఉద్యోగికి ఉండాల్సిన నైపుణ్యాలను వృత్తివిద్యా కోర్సు ద్వారా ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్) ఎంతో నేర్పిస్తుంది. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఈసీఈ, హెచ్‌ఈసీలతో పాటు పదో తరగతి పాసైన విద్యార్థులకు మరో కోర్సు వరంలా పరిణమించింది. ఈ ప్రభుత్వ కళాశాలలో ప్రధానంగా ఆఫీస్ అసిస్టెంట్ షిప్(ఓఏఎస్) కోర్సు విజయవంతంగా నడుస్తోంది. ప్రతీ సంవత్సరం ఎంతో మంది విద్యార్థులు 2 సంవత్సరాల కోర్సైన ఓఏఎస్‌ను చదివి ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో మంచి జీతంతో రాణిస్తున్నారు.

కోర్స్ వివరాలు..

పదోతరగతి తరువాత ప్రతి విద్యార్థి ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర కోర్సులు చదవాలని, అనంతరం ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చేయానుకొంటారు. అధికశాతం మంది విద్యార్థులు ఈ మార్గంలోనే వెళుతుంటారు. ఆ కోర్సులలో ప్రవేశం పొందాలని ఉన్నా, ఆర్థికస్తోమత, కుటుంబ నేపథ్యం వంటి కారణాలతో సతమతమవుతుంటారు. ఇలాంటి పేద విద్యార్థుల కోసం ఇంటర్‌లో రెండు సంవత్సరాల వృత్తివిద్యా కోర్సులు ప్రవేశపెట్టారు. వీటిలో ప్రధానంగా ఆఫీస్ అసిస్టెంట్ షిప్ (ఓఏఎస్), లాబ్ టెక్నీషియన్, మొదలైనవి ఉన్నాయి. అయితే ప్రధానంగా ఓఏఎస్ కోర్సుకు తీవ్ర డిమాండ్ ఉంది. సమాజంలో ఉద్యోగికి ఉండాల్సిన నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా ఈ కోర్సు పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కోర్సులలో ఇంగ్లీషు, జనరల్ ఫౌండేషన్ కోర్సు, బిజినెస్ ఆర్గనైజేషన్, టైపు రైటింగ్, అకౌంటెన్సీ, కంప్యూటర్, షార్ట్‌హేండ్, టాలీ, తదితర సబ్జెక్టులు బోధిస్తారు. వీటి వల్ల తక్కువ సమయంలో విద్యార్థులు స్థిరపడే అవకాశం ఉంది. ఆఫీసు సహాయకులు, స్టెనోగ్రాఫర్, అకౌంట్స్ అసిస్టెంట్, టైపిస్ట్, కాపియిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, పర్సనల్ అసిస్టెంట్, ప్రేవేట్ కార్యదర్శి, రిసెప్షనిస్ట్, కోర్టు మాస్టర్ తదతర ఉద్యోగాలు ఈ కోర్సు వల్ల లభిస్తాయి. ఈ కోర్సు పాసైన వారు బీఏ, బీకాం, బీబీఎం కోర్సులలో చేరేందుకు అర్హులు. ఈ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసి ఎందరో ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఈ కోర్సులో చేరగోరే విద్యార్థులు వివరాలకు కె.శ్రీనివాసరావు, సెల్ నెంబర్: 94413 91791 సంప్రదించాలన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించగలిగాను



నేను పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓఎస్‌ఏ కోర్సు పూర్తి చేశాను. ఈ కోర్సు చదవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. షార్ట్‌హేండ్ లోనూ, హైస్పీడ్ టైపులోనూ సర్టిఫికేట్స్ సంపాదించాను. ఏపీ, తెలంగాణ హైకోర్టులలో ఏక కాలంలో ఉద్యోగాలు సాధించగలిగాను.

– గోకా దేవి నాగసాయి ప్రియాంక, స్టెనోగ్రాపర్ గ్రేడ్ -3, ఇబ్రహీంపట్నం కోర్టు, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ

ఉద్యోగం సంపాదించాను



ఉన్నత చదువులు చదువుకోలేని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం మాది. నేను, మా అక్క పదో తరగతి పాసయ్యాక ఆఫీస్ అసిస్టెంట్ షిప్ కోర్సు చేశాం. ఈ కోర్సు వల్ల ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు నాకు పునాది అయ్యింది. నేను పెంటపాడు రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ సహాయకురాలిగా పని చేస్తున్నాను.

-బంగారు లలితాదేవి, జూనియర్ సహాయకురాలు, పెంటపాడు రెవెన్యూ కార్యాలయం

వృత్తి కోర్సులతో ఎంతో మేలు



నేను, మా తమ్ముడు ఈ కోర్సు చేయడం వల్ల కోర్టులో స్టెనోగ్రాఫర్లుగా స్థిరపడ్డాం. ఇంటర్ అర్హతతోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకొనే వారికి ఈ ఓఏఎస్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది.

-వై.వీర్రాజు, స్టెనో గ్రాఫర్ జ్యూడీషియల్ డిపార్ట్‌మెంట్, తణుకు

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

తణుకు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక పరిశ్రమ ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పరిశ్రమ అడిషనల్ సెక్రటరీ పి.వి.ఎస్.విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని వారి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి భూసరంక్షణ చేసుకోవాలని భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందజేయాలన్నారు. సంస్థ టెక్నికల్ అడ్వైజర్ గుళ్లపల్లి రంగారావు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి ఘన, ద్రవ, వాయువు రూపంలో వెలువడే వ్యర్థాలను వాటి యొక్క స్వభావం మేరకు శుద్ధి చేయడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి హాని కలుగకుండా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలో వివిధ రకాల సాంకేతిక వ్యవస్థల ద్వారా పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధిచేసి పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తున్నట్లు చెప్పారు. మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు, చీఫ్ కెమిస్ట్ బి.శ్రీనివాసరావు, ఎన్విరాన్మెంట్ విభాగం అధిపతి జి.బాబురావు, జి.ధనుంజయ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా దుర్గాపురం మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం షేక్ బాబాజీసాహెబ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రంథాలయ పాఠకుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆప్ కాస్ట్ జిల్లా సమన్వయ అధికారి మల్లుల శ్రీను, డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించి చెస్, క్యారమ్స్, డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు.

యనమదుర్రు డ్రెయిన్ అస్తవ్యస్తం

పాలకోడేరు: గొల్లలకోడేరు వద్ద యనమదుర్రు డ్రెయిన్ గుర్రపు డెక్కతో నిండిపోయి అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. కింది ప్రాంతాల వారికి సాగు నీరు అందించే ఈ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క నిండిపోవడంతో నీటి ప్రవాహం స్తంభించిపోయింది. అసలు నీటి జాడలే కనిపించనంతగా గుర్రపుడెక్క పేరుకు పోయింది. వర్షాలు ఎక్కువ కురిస్తే వరద నీరు క్రిందకు పారాలంటే ఈ డ్రెయిన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.